సాక్షి పల్నాడు

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



మల్లేశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జి

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ దుప్పల వెంకటరమణ సోమవారం దర్శించుకున్నారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



అమరేశ్వరుని సేవలో మంత్రి

అమరావతి: శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వర స్వామిని మంత్రి ఉషాశ్రీచరణ్ దర్శించుకున్నారు. కార్తిక దీపారాధన చేశారు.

అమరేశ్వరుని సేవలో జస్టిస్ రవీంద్రబాబు



అమరావతి: శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరుని సోమవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి ఎ.వి.రవీంద్రబాబు దంపతులు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

సమాచార హక్కు చట్టంతో సత్ఫలితాలు

ఆర్టీఐ కమిషనర్ శామ్యూల్ జోనాథన్



చీరాల టౌన్: సమాచార హక్కు చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వ శాఖ నుంచి పౌరులకు కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవచ్చని ఆర్టీఐ కమిషనర్ శామ్యూల్ జోనాథన్ అన్నారు. పట్టణంలోని డోలా ఐజాక్ ఎన్జీవో భవనంలో చీరాల షాడోస్ సంస్థ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి అడిగిన ప్రభుత్వ శాఖల నుంచి సమాచారాన్ని అందించడం ప్రభుత్వ అధికారుల బాధ్యతన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి పథకం, జీవోలు, అభివృద్ధి పనులు, తదితర ప్రతి అంశం గురించి తెలుసుకోవచ్చన్నారు. వ్యక్తి మీద కక్షలతో వారికి సంబంధించిన వివరాలను అడగరాదన్నారు. ప్రజలు కూడా స.హ. చట్టాన్ని కేవలం సమాజాభివృద్ధికి వినియోగిస్తేనే సత్ఫలితాలు పొందవచ్చని, స్వలాభం కోసం, బెదిరింపులకు ఈ చట్టాన్ని వినియోగించరాదని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ జి.ప్రభాకరరావు, షాడోస్ నిర్వాహకులు రాజాసాల్మన్, చైల్డ్ లేబర్ ఆఫీసర్ రామకృష్ణ, మహిళా కళాశాల పీడీ నీలకుమారి పాల్గొన్నారు.

రేపు జూనియర్ అసిస్టెంట్‌లకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి ఈనెల 13న సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ బి.శోభారాణి తెలిపారు. ఉమ్మడి మూడు జిల్లాల్లో జూనియర్ అసిస్టెంట్లు, టైపిస్టులు, జూనియర్ స్టెనోలు, స్టోర్ కీపర్లుగా పనిచేస్తున్న 28 మందికి ప్రమోషన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేశామన్నారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న మెడికల్ అండ్ హెల్త్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సెలింగ్ జరుగుతుందని వెల్లడించారు.

దివ్యాంగురాలికి ఇంటి స్థలం



నరసరావుపేట: దివ్యాంగురాలికి ఇంటి స్థలం పట్టాను కలెక్టర్ ఎల్.శివశంకర్ అందజేశారు. నాదెండ్ల మండలం, తూబాడు గ్రామానికి చెందిన వి.జ్యోతి ఇంటి స్థలం కేటాయించాలని గత నెల 'జగనన్నకు చెబుదాం'(స్పందన)లో దరఖాస్తు చేసుకుంది. ఆమెకు వెంటనే ఇంటి స్థలం మంజూరు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో బాధితురాలికి ఇంటి స్థలం మంజూరు పత్రాలు అందజేశారు.

రేపు భవిష్యనిధి పెన్షన్ అదాలత్

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 13న పెన్షన్ అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. గుంటూరు కృష్ణనగర్‌లోని భవిష్యనిధి ప్రాంతీయ కార్యాలయంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని పీఎఫ్ పెన్షనర్లు వారి ఫిర్యాదులు, దర్యాప్తులను నేరుగా భవిష్యనిధి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సమర్పించవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా హాజరు కాలేని వారు ఆన్‌లైన్, వాట్సాప్, వెబ్ మార్గాల ద్వారా పంపవచ్చని సూచించారు. ro.guntur@epfindia.gov.inతో పాటు వాట్సాప్ నంబరు 9494657469కు పంపాలని తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్లు 0863-2344106, 2232921 నంబర్లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.1800, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,300 వరకు పలికింది.

నవ సారథులు

• గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ అడుగులు • పలు నియోజకవర్గాల్లో ఇన్‌చార్జుల మార్పు



మేకతోటి సుచరిత
తాడికొండ



మల్లెల రాజేష్ నాయుడు
చిలకలూరిపేట



ఈవూరు గణేశ్
రేపల్లె



మేరుగ నాగార్జున
సంతనూతలపాడు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 11 మంది నియోజకవర్గ ఇన్‌చార్జులను మార్పు చేసింది. ఇందులో గుంటూరు జిల్లాలో నలుగురు, బాపట్లలో ముగ్గురు, పల్నాడు జిల్లాలో ఒకరు ఉన్నారు. గుంటూరు పశ్చిమకు మంత్రి విడదల రజిని, మంగళగిరికి ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, ప్రత్తిపాడుకు బాలసాని కిరణ్‌కుమార్, వేమూరుకు వరికూటి అశోక్‌బాబు, ప్రకాశం జిల్లా సంతనూతలపాడుకు మంత్రి మేరుగ నాగార్జున, తాడికొండకు మాజీ మంత్రి మేకతోటి సుచరిత, చిలకలూరిపేటకు మల్లెల రాజేష్ నాయుడు, అద్దంకికి పాణెం హనిమిరెడ్డి, రేపల్లెకు ఈవూరు గణేష్‌లను ఇన్‌చార్జులుగా నియమించారు. ఈ మేరకు పార్టీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, బొత్స సత్యనారాయణ తాడేపల్లి పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రకటన చేశారు. 2024 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఈ మార్పులు చేశారు. అన్ని స్థానాల్లో విజయమే లక్ష్యంగా ఇన్‌చార్జుల నియామకంపై పార్టీ కసరత్తు చేస్తోంది. కొత్తగా ప్రకటించిన ఇన్‌చార్జులు వెంటనే బాధ్యతలు చేపడతారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జులుగా ఉన్న వారి సేవలను పార్టీ వేరే విధంగా ఉపయోగించుకోనుంది.

గెలి'చేనేత' గంజి

- మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆప్కో మాజీ చైర్మన్ గంజి చిరంజీవికి బాధ్యతలు అప్పగించారు. గంజి చిరంజీవి 2014లో 12 ఓట్ల స్వల్ప తేడాతో తెలుగుదేశం తరఫున పోటీ చేసి ఓడిపోయారు. గత ఏడాది ఈయన వైఎస్సార్ సీపీలో చేరారు. చేనేత వర్గాల్లో ఈయనకు మంచి పట్టు ఉంది.

సుపరిచిత సుచరిత

- తాడికొండ బాధ్యతలు మాజీ హోం మంత్రి మేకతోటి సుచరితకు అప్పగించారు. ప్రస్తుతం ఆమె ప్రత్తిపాడు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆమె సొంత మండలం ఫిరంగిపురం తాడికొండ పరిధిలోకే వస్తోంది.

ప్రకటించిన పార్టీ అధిష్టానం



పశ్చిమాన నవోదయం



విడదల రజిని
గుంటూరు పశ్చిమ

- చిలకలూరిపేటలో తెలుగుదేశం పార్టీ కంచుకోటను బద్దలు కొట్టిన మంత్రి విడదల రజినికి గుంటూరు పశ్చిమ బాధ్యతలు అప్పగించింది. ఈ సీటు మొదటి నుంచి తెలుగుదేశం పార్టీకి పట్టంకడుతోంది. గత ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీ తరఫున మద్దాళి గిరి గెలుపొందారు. తర్వాత ఆయన వైఎస్సార్ సీపీలో చేరారు. ఈసారి ఈ సీటును వైఎస్సార్ సీపీ గెలుచుకోవడం కోసం విడదల రజినిని పశ్చిమానికి మార్చారు.

కొత్త 'కిరణం'

- ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా విజయవాడకు చెందిన బాలసాని కిరణ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈయన విజయవాడ పూర్ణానందం పేటలో ఉంటూ న్యాయవాదిగా ఉన్నారు.

పేటకు 'మల్లెల' దండ

- పల్నాడు జిల్లా చిలకలూరి పేటకు మల్లెల రాజేష్ నాయుడిని ఇన్‌చార్జిగా ప్రకటించారు. ఇక్కడ గెలిచిన మంత్రి రజనికి గుంటూరు పశ్చిమ అప్పగించడంతో రాజేష్‌నాయుడిని ఇక్కడ నియమించారు. ఈయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. రాజేష్ నాయుడు తాత మల్లెల బుచ్చయ్య చిలకలూరిపేట మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, కొమరవల్లిపాడు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా పనిచేయగా, తండ్రి మల్లెల సత్యనారాయణ మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. రాజేష్‌నాయుడు ప్రస్తుతం ఏపీఎస్ఐడీసీ డైరెక్టర్‌గా ఉన్నారు.

అశోక్ ఆరంగేట్రం

- బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన మంత్రి మేరుగ నాగార్జునను బాపట్ల పార్లమెంట్ పరిధిలోని సంతనూతలపాడు ఇన్‌చార్జిగా నియమించారు. వేమూరుకు ప్రకాశం జిల్లా కొండెపి ఇన్‌చార్జిగా ఉన్న వరికూటి అశోక్‌బాబును నియమించారు. ఆయన గతంలో రవాణా శాఖలో పనిచేసి తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు.

రైతు బిడ్డ పాణెం

- బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం ఇన్‌చార్జిగా పాణెం హనిమిరెడ్డిని నియమించారు. ఈయన పెదకూరపాడు నియోజకవర్గంలోని క్రోసూరు మండలం దొడ్లేరు గ్రామానికి చెందిన రైతు కుటుంబం నుంచి వచ్చారు. 2016-17 సంవత్సరంలో పెదకూరపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా, ఆ తర్వాత పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారు.

రేపల్లె గోపాలుడు గణేశ్

- రేపల్లె నియోజకవర్గానికి ఈవూరు గణేష్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఈయన తల్లి ఈవూరు సీతారావమ్మ గతంలో కూచినపూడి నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.



బాలసాని కిరణ్‌కుమార్
ప్రత్తిపాడు



గంజి చిరంజీవి
మంగళగిరి



వరికూటి అశోక్‌బాబు
వేమూరు



పాణెం హనిమిరెడ్డి
అద్దంకి

కో'లా'హలం



వైఎస్సార్ లా నేస్తం చెక్కును అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ

- 'వైఎస్సార్ లా నేస్తం'తో యువ న్యాయవాదులకు ఆర్థిక చేయూత
- జిల్లాలో 157 మందికి లబ్ధి
- రూ.47.10 లక్షల మేర ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు

నరసరావుపేట: కొత్తగా న్యాయవాద వృత్తి చేపట్టిన జూనియర్ లాయర్లకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్సార్ లా నేస్తం' పథకం ఆర్థిక చేయూతతోపాటు వృత్తిలో కొనసాగేందుకు మరింత ప్రోత్సాహాన్నిస్తోందని జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2023-24 ఏడాదికి సంబంధించి రెండో విడతగా 6 నెలల (జూలై-డిసెంబర్ వరకు) 'లా నేస్తం' నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జూనియర్ లాయర్లతో కలిసి జేసీ వీక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ లా డిగ్రీ తీసుకున్న తర్వాత తొలి మూడేళ్ల న్యాయవాదిగా స్థిరపడేందుకు 'లా నేస్తం' ద్వారా ఇచ్చే స్టైఫండ్ ఎంతో ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఈ గొప్ప పథకాన్ని న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థికసాయంతో వృత్తిలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సమాజాభివృద్ధి కోసం వృత్తినైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 157 మందికి రూ.47.10 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. అనంతరం నమూనా చెక్కును బహూకరించారు.

'జగనన్నకు చెబుదాం'కు 107 అర్జీలు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ అధ్యక్షత వహించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ వసంత బాబు, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంతో కలిసి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి 107 అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలను విన్నారు. శాఖల వారీగా జిల్లా అధికారులకు పంపారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చిన ప్రజలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా నిర్వాహకులు దాతల సాయంతో ఉచిత భోజన వసతి కల్పించారు.

నా స్థలాన్ని సర్వే చేయించండి

నాకు రామిరెడ్డిపేటలో రెండు సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలంలో బ్యాంకు ద్వారా రుణం తీసుకొని ఇల్లు కట్టుకోవాలని అనుకుంటున్నాం. ఇప్పటికి రెండుసార్లు సర్వే కోసం చలానా చెల్లించాం. సర్వేయర్ రావట్లేదు. అడిగితే వస్తున్నా అంటారు. రారు. ఇప్పటికైనా నా స్థలాన్ని సర్వే చేయించి నాకు సర్టిఫికెట్ ఇప్పించండి.

– సరికొండ హనుమాయమ్మ, రామిరెడ్డిపేట, నరసరావుపేట

మినీ మార్కెట్ యార్డుకు స్థల పరిశీలన

కొల్లిపర: స్థానికంగా ఏర్పాటు చేయనున్న మినీ మార్కెట్ యార్డు నిర్మాణానికి స్థలాన్ని తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మండల కేంద్రంలోని కొల్లిపరలో మినీ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ అవుతు సీత నగేష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.నాంచరయ్య, మండల వ్యవసాయాధికారి కె.వెంకటరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, సొసైటీ అధ్యక్షులు బొంతు శ్రీనివాస రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుధాకర్, ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ శివప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ బి.కోటేశ్వరరావు(సాయి) తదితరులు పాల్గొన్నారు.



మినీ మార్కెట్ యార్డు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ గీతాంజలిశర్మ

వీరుల సంబరం

అంకమ్మతల్లి వీరతిలకం దిద్దిందా.. నాగులేరు సంబరోత్సాహంతో పరవళ్లు తొక్కిందా.. చెన్నకేశవుని గుడిగంట గణగణమోగుతూ సుస్వాగతం అంటూ వీరాచారులకు ఆహ్వానం పలికిందా.. బ్రహ్మనాయుడు ఆయుధం వీరవిహారానికి కాలుదువ్విందా.. అన్నట్టు రణక్షేత్రం కారెంపూడి ఉత్సాహంతో ఉప్పొంగుతోంది. వీరారాధనోత్సవాలకు సిద్ధమవుతోంది.

- నేటి నుంచి పల్నాటి వీరారాధనోత్సవాలు
- ఐదురోజులపాటు అట్టహాసంగా..
- స్వస్థలానికి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వీరాచారులు



వీరుల గుడిలో కొలువైన పల్నాటి వీరుల ఆయుధాలు



నాగులేరు ఒడ్డున ఉన్న పల్నాటి వీరుల గుడి

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలు మంగళవారం నుంచి ఐదు రోజులపాటు రణక్షేత్రం కారెంపూడి (కార్యమపూడి)లో ప్రారంభం కానున్నాయి. క్రీ.శ.1182లో జరిగిన పల్నాటి యుద్ధంలో అమరులైన వీరులను పల్నాటి వీరుల వారసులు వంశ పారంపర్యంగా ఏటా రణక్షేత్రానికి తరలివచ్చి స్మరించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న వేలాది మంది వీరాచారులు తరలివచ్చి తమ ఆచారాలను పాటించనున్నారు. వీరుల ఆయుధాలను దైవాలుగా కొలుస్తూ గ్రామోత్సవాలు నిర్వహించనున్నారు. కత్తి సేవలు చేయనున్నారు. వీర్ల అంకాలమ్మ తల్లి, చెన్నకేశవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పల్నాటి చరిత్రలో ముఖ్యమైన ఐదు చారిత్రక ఘట్టాల పేర్లతో ఐదు రోజులపాటు ఉత్సవాలు జరగనున్నాయి. మొదటి రోజు 12న రాచగావు, 13న రాయబారం, 14న మందపోరు, 15న కోడి పోరు ఉత్సవాలు జరగనున్నాయి. చివరి రోజు కళ్లిపాడుతో ఉత్సవాలు ముగుస్తాయి.

14న బ్రహ్మనాయుడు చాపకూడు అమలు

ఈ ఉత్సవాలలో పాల్గొనడానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే)తో పాటు పలువురు ప్రభుత్వ పెద్దలు, జిల్లా పాలనా అధికారులు తరలిరానున్నారు. మందపోరు నాడు 14వ తేదీ బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతాన్ని అమలు చేయనున్నారు. అందుకు ప్రభుత్వ విప్ పీఆర్కే ఆదేశాలతో వేలాది మందికి అన్నదాన ఏర్పాట్లు జరుగుతున్నాయి. 15వ తేదీ జరిగే కోడి పోరు ఉత్సవం ప్రధానమైనది. ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలిరానున్నారు. అంకాలమ్మ తల్లి, చెన్నకేశవస్వామికి పూజలు చేయనున్నారు. అనంతరం వీరుల గుడికి తరలి వచ్చి పల్నాటి వీరుల ఆయుధాలకు పూజలు నిర్వహించనున్నారు.



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి



స్వామి అభిషేకాల్లో పాల్గొన్న భక్తులు

భక్తజన 'కోటప్ప'

నరసరావుపేట రూరల్: ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో భక్తుల కోలాహలం నెలకొంది. కార్తిక మాసం చివరి సోమవారం కావడంతో త్రికోటేశ్వరుడిని దర్శించుకునేందుకు భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చారు. తెల్లవారుజామున బిందె తీర్థంతో స్వామికి ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామి దర్శనానికి అనుమతించారు. అయ్యప్పమాలధారులు, భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. ఆలయం వెనక ఉన్న రావిచెట్టు, మహానందీశ్వరుడు, ఉసిరి చెట్టు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా మూలవిరాట్ అభిషేకాలు రద్దుచేశారు. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనంతో భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ కనిపించింది. ఉదయం 10 గంటల తరువాత కొండపైన భక్తుల తాకిడి పెరిగింది. ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్రవాహనాలతో భక్తులు కొండపైకి చేరుకున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసి భక్తులను కొండపైకి చేరవేసింది. సోపాన మార్గం ద్వారా భక్తులు మెట్ల పూజ చేసుకుంటూ కొండపైకి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్వామి నిత్యాన్నదాన మండపంలో భక్తులకు ఉచిత అన్నప్రసాదం అందజేశారు. ఆలయ ప్రాంగణంలో స్వామి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ ఈఓ గొలమూరి శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్లుప్తంగా

పల్నాటి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవతో జిల్లా ఎస్పీ



ఎస్పీ రవిశంకరరెడ్డిని ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ

కారెంపూడి: ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పల్నాటి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డి చెప్పారని పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఎస్పీ రవిశంకరరెడ్డిని సోమవారం కలసి పల్నాటి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానం పలికినట్లు పీఠాధిపతి పేర్కొన్నారు. తప్పకుండా వస్తానని చెప్పారన్నారు. 14వ తేదీ బ్రహ్మనాయుడు చాప కూడు సహపంక్తి భోజనాల అమలు కార్యక్రమానికి వస్తానని చెప్పారన్నారు. ఉత్సవాలలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. పీఠాధిపతితో పాటు పీఠం నిర్వాహకుడు విజయ్‌కుమార్ ఎస్పీని కలిసినవారిలో ఉన్నారు. ఎస్పీని పీఠాధిపతి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు.

200 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు...

కారెంపూడి: పల్నాటి ఉత్సవాలకు 200 మంది పోలీసులు, అధికారులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని గురజాల డీఎస్పీ పల్లపురాజు పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవకు వివరించారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ డీఎస్పీని మంగళవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ రవిశంకరరెడ్డి ఆదేశాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఉత్సవాల ప్రారంభ తేదీ మంగళవారం నుంచే అందరూ విధుల్లో చేరతామని డీఎస్పీ పల్లపురాజు ఈ సందర్భంగా తెలిపారు. కారెంపూడి సీఐ డి.జయకుమార్, ఎస్ఐ ఎం.రామాంజనేయులు ఉన్నారు.

కాపులకు వైఎస్ కుటుంబం అండగా నిలిచింది



కాపు కార్తికమాస వన సమారాధనలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వేదికపై మంత్రి అంబటి



మాట్లాడుతున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కాపుల మధ్య చిచ్చు పెట్టేందుకు చంద్రబాబు కుట్ర
- కాపు వన సమారాధనలో మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, అంబటి

రాజుపాలెం: కష్టాలలో ఉన్నవారికి కాపుకాసి అండగా నిలిచే వాళ్లే కాపులని, కాపు సామాజిక వర్గానికి వైఎస్ కుటుంబం అండగా నిలిచిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. మండలంలోని చౌటపాపాయపాలెం సమీపంలోని మామిడి తోటలో కాపు కార్తిక వన సమారాధన సోమవారం నిర్వహించారు. కాపు, బలిజ, తెలగకు చెందిన కార్తిక వన సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కాపు కార్తిక వనసమారాధనలో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖా మాత్యులు గుడివాడ అమర్‌నాథ్, పలువురు కాపు సామాజిక వర్గ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ వైఎస్ కుటుంబం నాటినుంచి నేటివరకు కాపులకు అండగా నిలిచిందన్నారు. వైఎస్ కుటుంబాన్ని నమ్మి నిలిచిన వ్యక్తి అంబటి రాంబాబు అన్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ స్వార్థపరుడని, టీడీపీని విమర్శించి పదవుల కోసం తిరిగి ఆ పార్టీలోనే చేరి బాబుకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గంలో తాను తప్ప కాపులు ఇంకెవ్వరూ గెలవలేదని అన్నారు. ఇచ్చిన మాటకోసం, పార్టీకోసం ఎంతదూరమైనా వెళతానని అన్నారు. కాపుల మధ్య చిచ్చు పెట్టేందుకే చంద్రబాబు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. కాపులను అణగదొక్కిన చంద్రబాబుకు పవన్ కల్యాణ్ ఎందుకు ఊడిగం చేస్తున్నారని ప్రశ్నించారు. తెలంగాణలో తనను ఓడించిన చంద్రబాబుకు పవన్ ఎందుకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. అలాంటి పవన్ వెంట ఎందుకు వెళ్లాలో కాపులు ఆలోచించుకోవాలని అన్నారు. పదవుల కోసం పూటకో పార్టీ మార్చేవాడిని కాదని గుర్తుపెట్టుకోవాలని అన్నారు. వన సమారాధనకు వచ్చిన కాపు సోదరులందరికీ అభినందనలు తెలిపారు. రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో ముద్రగడ పద్మనాభంను అప్పటి ప్రభుత్వం తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్న పరిస్థితుల్లో రాష్ట్రంలోని కాపు నాయకులందరినీ ఏకం చేసిన ఘనత అంబటి రాంబాబుదేనని గుర్తు చేశారు. అంబటి వైఎస్ కుటుంబానికి విశ్వాసపాత్రుడైతే కన్నా స్వార్థపరుడని, కాపులు ఎటువైపు నిలబడాలో ఇప్పుడు నిర్ణయం తీసుకోవాలన్నారు. మామిడి తోటలో జరిగిన కాపు కార్తిక వన సమారాధనకు కాపు, తెలగ, బలిజ వర్గాల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడప శేషు, డీసీసీబీ చైర్మన్ సీతంశెట్టి సీతారామాంజనేయులు, లాయర్ పక్కాల సూరిబాబు, కాపు నాయకులు మాజీ ఎంపీపీ పులిబండ్ల వెంకటేశ్వర్లు, వెంపా జ్వాలా నరసింహారావు, పులిబండ్ల అశోక్, తోట మోహన్, బగ్గి నరసింహారావు, తాళ్లూరి మోహన్‌రావు, కావటి రామాంజనేయులు, తోట లక్ష్మీనారాయణ, జెడ్పీటీసీ శిరిగిరి గోపాలరావు, పూల ధనవంత్రి, సదరం హరి, తదితరులు పాల్గొన్నారు.

అమరావతి శిల్పకళ అద్భుతం

అమరావతిని సందర్శించిన ప్రవాస భారతీయ బౌద్ధ పరిశోధకులు



మ్యూజియంలో శిల్పాలను తిలకిస్తున్న ప్రవాస బౌద్ధ పరిశోధకులు

అమరావతి: శిల్పకళలన్నిటిలోను అమరావతి శిల్పకళ అద్భుతమని ప్రవాస భారతీయ బౌద్ధ పరిశోధకులు భాస్కర్, తలాటం నగేష్ అన్నారు. సోమవారం దక్షిణ భారత బౌద్ధస్థావరాల సందర్శన కార్యక్రమంలో భాగంగా సోమవారం అమరావతి స్థూపాన్ని, మ్యూజియాన్ని సందర్శించారు. ప్రముఖ బౌద్ధ నిపుణుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్, సీఈఓ, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అమరావతి చరిత్ర, ధరణికోట చరిత్ర, బౌద్ధస్తూపం, మ్యూజియంలోని బుద్ధుని శిల్పాలు, శిలాఫలకాలు, శాసనాలు, ధాతుపేటికల వివరాలను వారికి వివరించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయ బౌద్ధ పరిశోధకులు భాస్కర్, తలాటం నగేష్ మాట్లాడుతూ మ్యూజియంలో ప్రదర్శనలోనున్న రెండువేల ఏళ్ల నాటి శాతవాహన కాలపు బౌద్ధశిల్పాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయంటే ఆనాటి శిల్పకళ చాతుర్యానికి అద్దం పడుతున్నాయన్నారు. మహాస్తూపం వద్ద గల అతిపెద్ద స్తంభం మీద శాతవాహనుల కాలపు బుద్ధుని అసంపూర్ణ రేఖా చిత్రం ఉందని, దక్షిణాపథ రాజధానిగా విలసిల్లిన ధాన్యకటకంలోని మట్టికోట గోడను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రవాస భారతీయ బౌద్ధ పరిశోధకులు భాస్కర్, తలాటం నగేష్ శివనాగిరెడ్డితో కలిసి అమరావతికి చెందిన ప్రముఖ బౌద్ధ రచయిత వావిలాల సుబ్బారావును కలిసి ఆచార్య నాగార్జున రచనలపై చర్చించారు.

లబ్ధిదారుడి మోములో 'నవోదయం'

లబ్ధిదారుడికి కారు అందజేసిన కలెక్టర్



నరసరావుపేట: నవోదయంలో దరఖాస్తు చేసుకున్న వ్యక్తికి జగనన్న బడుగు వికాసం కింద యూనియన్ బ్యాంకు రుణం ద్వారా మంజూరైన కారును జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ సోమవారం కలెక్టరేట్‌లో అందజేశారు. మండలంలోని లింగంగుంట్ల అగ్రహారం చెందిన వాసుపల్లి ప్రసాద్ తనకు ఉపాధి చూపించాలంటూ నవోదయంలో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కలెక్టర్ చొరవతో లబ్ధిదారుడికి రూ.11.80లక్షలు ఖరీదు చేసే కారును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రుణంగా ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. లబ్ధిదారునికి 45 శాతం సబ్సిడీతో కారు రావడంతో జిల్లా కలెక్టర్, నవోదయం అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా నవోదయం నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు, ఉద్యానవన, సూక్ష్మ సేద్యం జిల్లా అధికారులు బీజే బెన్నీ, ఆంజనేయులు, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, సాంఘిక సంక్షేమశాఖ పీడీ ఓబులునాయుడు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర షూటింగ్ బాల్ పోటీల్లో బాలికల హవా

గుంటూరు వెస్ట్(క్రీడలు): అండర్–19 బాలబాలికల షూటింగ్ బాల్ పోటీల్లో బాలికల జట్టు ప్రథమ, బాలుర జట్టు ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయని గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిషోర్ బాబు సోమవారం తెలిపారు. ఈ నెల 10వ తేదీన బాపట్ల జిల్లా మార్టూరులో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. క్రీడాకారులను అసోసియేషన్ జిల్లా చైర్మన్ రవిబాబు, కోచ్‌లు తేజ, జ్యోతి అభినందించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

- పొలంలో మోటారు ఆన్ చేస్తుండగా ఘటన
- మేనమామ, మేనల్లుడు మృతితో గన్నవరం గ్రామంలో విషాద ఛాయలు



వేముల నాగరాజు



మడక నరసింహారావు

రెంటచింతల: మండలంలోని తుమృకోట గ్రామశివార్లోని పంటపొలంలో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకున్న సంఘటన సోమవారం జరిగింది. మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన వేముల నాగరాజు(35), తన మేనమామ మడక నరసింహారావు(42) ఇద్దరూ వరిపంటకు నీరు పెట్టేందుకు ఉదయం 9గంటలు వెళ్లి పొలంలోని విద్యుత్ మోటారు వేస్తుండగా విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఉదయం వెళ్లిన ఇద్దరు సాయంత్రానికి కూడా ఇంటికి తిరిగి రాకపోవడంతో పొలంవెళ్లి చూడగా విద్యుత్ మోటర్ వద్ద వారు మృతిచెందిపడి ఉండటం కుటుంబ సభ్యులు గమనించారు. మృతుడు వేముల నాగరాజు తండ్రి అమరయ్య, తల్లి కాంతమ్మ ఇద్దరు ఆదివారం రాత్రి శబరిమల వెళ్తుండగా ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన మడక నరసింహారావు గన్నవరం వచ్చాడు. మేనల్లుడికి సహాయంగా పొలం వెళ్లి మృతి చెందాడు. మృతుడు నాగరాజు దుర్గి మండలం జంగమహేశ్వరపాడు వద్ద ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తుండగా ఆయనకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. నరసింహారావుకు భార్య శివపార్వతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలానికి కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ సిబ్బందితో చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించి, వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పంచనామా నిమిత్తం మృతులను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రైల్వే ట్రాక్‌పై పడిపోయిన మహిళ

ప్రాణాలు కాపాడిన స్థానికులు



గాయపడిన డ్వాక్రా లీడర్ లక్ష్మి

తాడేపల్లిరూరల్: మంగళగిరి– తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డ్వాక్రా లీడర్ సమయానికి బ్యాంకుకు వెళ్లాలని రైల్వే ట్రాక్ దాటుతుండగా కంగారులో కిందపడి గాయాలపాలైన ఘటన సోమవారం తాడేపల్లి కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలోని వైఎస్సార్ సెంటర్ వద్ద చోటుచేసుకుంది. వివరాలు.. తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడులో నివాసముండే డ్వాక్రా లీడర్ లక్ష్మి, ఎల్లమ్మ డ్వాక్రా గ్రూప్‌కు లీడర్‌గా పనిచేస్తోంది. గ్రూపు సభ్యులందరూ కలసి సాయంత్రం 3 గంటల సమయంలో రూ.84 వేలు ఇవ్వడంతో బ్యాంకులో జమ చేసేందుకు సాయంత్రం 4 గంటల 10 నిమిషాలకు వైఎస్సార్ సెంటర్‌లోని రైల్వే గేటు వద్దకు ఆటోలో వచ్చింది. గేటు మూసి ఉండడంతో బ్యాంక్ సమయం అయిపోతుందని నగదు బ్యాగ్‌ను తీసుకుని రైలు పట్టాలు దాటుతుండగా కింద పడిపోయింది. అదే సమయంలో అతివేగంగా రైలు వస్తుండడాన్ని స్థానికులు గమనించి ఆమెను పట్టాల మీద నుంచి పక్కకు లాగి రక్షించారు. ఆమె చేతికి ఉన్న బ్యాగ్ రైలుకు తగిలి బ్యాగ్‌లో ఉన్న రూ.84 వేల నగదు బయటకు వచ్చి రైలు వేగానికి గాల్లో ఎగిరిపోయాయి. అది గమనించిన స్థానికంగా ఉన్న యువకులు ఆ డబ్బులు సేకరించి మహిళకు ఇవ్వగా ఇంకా రూ.24 వేలు కనిపించడం లేదంటూ ఆమె తెలిపింది. ఈ ప్రమాదంలో మహిళ బొటన వేలికి తీవ్ర గాయమైంది. బ్యాంకుకు సమయం అయిపోతోందనే తొందరలో రైల్వే ట్రాక్ దాటి వెళుతున్నాని, ఆ సమయంలో కింద పడ్డానని అంతవరకు తనకు గుర్తుందని ఆమె పేర్కొంది. స్థానికులు గాయపడిన మహిళకు స్థానికంగా ఉన్న ఆస్పత్రిలో చికిత్స చేయించి, ఆటోలో ఇంటికి పంపించారు.

డబ్బులిస్తే మోసం చేశారు.. న్యాయం చేయండి

జిల్లా ఎస్పీ 'జగనన్నకు చెబుదాం'లో పలు ఫిర్యాదులు స్వీకరణ


నరసరావుపేట: కూలీలు కావాలని డబ్బులు ఇస్తే ఆ డబ్బులు తీసుకొని వారిని పంపించకుండా మోసం చేశారని చిలకలూరిపేట మండలం కావూరుకు చెందిన కిన్నెర వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగన్నన్నకు చెబుదాం కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం, ఆన్‌లైన్ ద్వారా నగదు అపహరణ, కుటుంబ, ఆర్థిక, ఆస్తి, పొలం తదితర సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందుకున్నారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేస్తూ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తులు తమకు పొగాకు బ్యారెన్‌లో పనిచేసేందుకు కూలీలు కావాలంటూ మధ్యవర్తినైన తనకు రూ.6.70లక్షలు ఆన్‌లైన్ ద్వారా పంపించారన్నారు. నేను ఒప్పుకొని కూలీల కోసం మాచర్ల, పందిళ్లపాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులతో ఒప్పందం కుదుర్చుకొని ఆ డబ్బులు అందజేశానన్నారు. అయితే డబ్బులు తీసుకున్న వారు కూలీలను పంపించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. తనకు డబ్బులిచ్చిన వారు తన పొలాన్ని తాకట్టు రాయించుకున్నారన్నారు. డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు.



ఎస్పీకి అర్జీలు అందజేసి సమస్య చెబుతున్న అర్జీదారులు

శివనామస్మరణతో మార్మోగిన అమరారామం

అమరావతి: ప్రసిద్ధ పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరావతి శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరాలయం కార్తిక సోమవారం పర్వదినాన భక్తులచే శివపంచాక్షరి నామస్మరణతో మార్మోగింది. సోమవారం వేకువ జామున పంచారామ క్షేత్రం సందర్శకులతో కిటకిటలాడింది. భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేసి ఆలయంలోని ఉసిరి చెట్టు వద్ద దీపారాధనలు చేశారు. ఉదయాన్నే భక్తుల పరోక్షంలో కార్తికమాస అభిషేక పథకం ద్వారా నిర్వహించే అభిషేకాలను అర్చకస్వాములు నిర్వహించారు. అలాగే భక్తులు స్వామివారికి ఎనిమిదివందలకుపైగా అభిషేకాలతోపాటు అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. వేకువజామునే పంచారామ క్షేత్రాలను సందర్శించే సుమారు వందకు పైగా బస్సులలో వచ్చిన భక్తులతో దేవాలయంలో సందడి ఏర్పడింది. మధ్యాహ్నం నుంచి జిల్లావ్యాప్తంగా రావాల్సిన భక్తుల సందర్శన క్రమేపి పెరిగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వేమూరి గోపినాథశర్మ నిరంతరం పర్యవేక్షించారు. అలాగే ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా దేవాలయ పరిసర ప్రాంతాలలో, స్నానఘాట్‌లలో సీఐ ఏవీ బ్రహ్మం ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.



విశేషాలంకారంలో అమరేశ్వరుడు



అమరేశ్వరస్వామి సన్నిధిలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సీసీఐ కేంద్రానికి భారీగా పత్తి రాక

నియోజకవర్గంలో రెండో కొనుగోలు కేంద్రం



కేంద్రానికి భారీగా తరలివచ్చిన పత్తి లోడు వాహనాలు

యడ్లపాడు: పత్తి పంట దిగుబడి ఈ ఏడాది ఆశాజనకంగా ఉంది. దీనికితోడు ప్రభుత్వం క్వింటాకు రూ.7,020 మద్దతు ధర ఇవ్వడంతో పత్తిరైతులు తమ ఉత్పత్తుల్ని సీసీఐ కేంద్రానికి భారీగా తరలిస్తున్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. నాదెండ్ల మండలం గణపవరంలోని కృష్ణారెడ్డి మిల్లులో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తుంది. అయితే రైతులు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో అధిక మొత్తంలో వస్తున్న పత్తిని కొనుగోలు చేసేందుకు మరో కేంద్రాన్ని అధికారులు అందుబాటులోకి తెచ్చారు. సమయం, దూరాభారం, బాడుగల ఖర్చుల్ని తగ్గించాలనే యోచనతో యడ్లపాడు మండలం తిరుమల కాటన్ మిల్లులో రెండోపాయింట్‌ను సోమవారం ప్రారంభించారు. సీసీఐ బయ్యర్ రమేష్ నేతృత్వంలో ఉదయం నుంచే ముమ్మరంగా పత్తి కొనుగోళ్లు కొనసాగాయి. హైవే సర్వీసు రోడ్డుపై పత్తి ఉత్పత్తుల లోడుతో ఉన్న వాహనాలు బారులుదీరాయి. రైతులు ఇబ్బంది పడకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇప్పటికే 20వేల క్వింటాళ్లు కొనుగోలు..

నియోజకవర్గంలో ఇప్పటివరకు 20 వేల క్వింటాళ్లను భారత పత్తి సంస్థ కొనుగోలు చేసినట్లు బయ్యర్ రమేష్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు వివరాలను తెలిపారు. బన్ని బ్రహ్మ రకం పింజ పొడవు 29.5–30.5 ఎంఎం(3.5–4.3) మైక్రోనైర్ క్వింటా ధర రూ.7,020, అలాగే బన్ని బ్రహ్మ స్పెషల్ పింజ29.01–29.49 (3.5–4.3) మైక్రోనైర్ క్వింటా ధర రూ.6,970, ఎంఈసీహెచ్ పింజ 27.5–28.5(3.5–4.7)మైక్రోనైర్ క్వింటాకు రూ.6,920 మద్దతు ధర వర్తిస్తుందన్నారు. పత్తిలో తేమ 8శాతం అంతకంటే తక్కువ ఉండాలన్నారు. అంతకంటే పెరిగితే ప్రతి ఒక్క శాతానికి మద్దతు ధరలో ఒక్కశాతం తగ్గుతుందన్నారు. తేమ 11శాతానికి మించితే కొనుగోలు చేయరని, రైతులు పత్తిని లూజు రూపంలో తీసుకురావాలని సూచించారు. మైక్రోనైర్ విలువ నిర్ణీత పరిధికంటే తక్కువ లేదా ఎక్కువగా ఉంటే 0.2విలువకు రూ.25 చొప్పున ప్రతి క్వింటాకు తగ్గిపోతుందన్నారు. కొనుగోలు చేసిన పత్తికి నగదును నేరుగా రైతు బ్యాంకు ఖాతాకు ఆర్‌టీజీఎస్ ద్వారా చెల్లించనున్నట్లు తెలిపారు. ఇందుకు రైతులు తమ బ్యాంక్ అకౌంట్ నంబర్లు ఇవ్వాలన్నారు.

రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ఏఎన్‌యూ అంతర కళాశాలల ఖోఖో విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతగా నిలిచిన జట్టుతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడామైదానంలో నిర్వహించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల ఖోఖో టోర్నమెంట్ బహుమతి ప్రదానోత్సవ సభలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉత్తమ క్రీడాకారులను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆడుదాం ఆంధ్రా చేపట్టినట్టు తెలిపారు. దీని ద్వారా మట్టిలో మాణిక్యాలుగా మిగిలిపోయిన క్రీడాకారులను వెలికితీయవచ్చని వివరించారు. కాగా, టోర్నమెంట్‌లో విక్టరీ డిగ్రీ కళాశాల (నరసరావుపేట) ప్రథమ, డీసీఆర్ఎం డిగ్రీ కళాశాల జట్లు (ఇంకొల్లు) ద్వితీయ స్థానం సాధించాయి. పల్నాడుజిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, కళాశాల డైరెక్టర్లు మైనీడి శ్రీనివాసరావు, ఇ.కోటిరెడ్డి, కార్యదర్శి వి.సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ పి.వేణుగోపాల్, భావన కళాశాల ప్రిన్సిపాల్ జి.రామచంద్రారెడ్డి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.కృష్ణంరాజు పాల్గొన్నారు.

రమాదేవికి సాహితీరత్న జాతీయ పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న సరికొండ రమాదేవి

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ టీచర్, రచయిత డాక్టర్ సరికొండ రమాదేవికి తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సాహితీ రత్న జాతీయ పురస్కార ప్రదానం చేశారు. ఈ నెల 10న విజయవాడలోని రాఘవయ్య పార్క్ వద్ద గల బాలోత్సవ భవనంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ వారిచే ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ ఐదు రాష్ట్రాల స్థాయిలో వివిధ రంగాలలో ప్రావీణ్యం పొందిన దాదాపు 200 మందికి కళలు, సాంఘిక సేవా, విద్య, వైద్య, అర్చక, భరతనాట్యం రంగాలలో పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ క్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక గౌరవ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ వంగళ శాంతి కృష్ణ ఆచార్య, చందు సాంబశివరావు, రాజకుమార్ చేతుల మీదుగా రచయిత రమాదేవికి సాహితీరత్న జాతీయ పురస్కార ప్రదానం చేశారు. జ్ఞాపిక, పతకం, ప్రశంసాపత్రం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రమాదేవిని సత్తెనపల్లిలో వివిధ కళా సంస్థల అధ్యక్ష, కార్యదర్శులు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.